# ఓ మాధురి కథ

ఏడాదిన్నర పాపను బుజ్జగిస్తూ అన్నం తినిపిస్తోంది మాధురి. కిటికీ దగ్గర నిల్చోబెట్టి బయటికి చూపిస్తూ గోరు ముద్దలు నోట్లో పెడుతూంది. పాప మారాం చేస్తూంటే దూరం నుండి వస్తున్న సైకిల్‌ను చూపిస్తూ... "అదిగో.... బూచోడొస్తున్నాడు. తొందరగాతినమ్మా!. పట్టుకు పోతాడు తెల్సా?" అంటూ తినిపిస్తోంది. పాప బెదర లేదు. అలావస్తూన్న సైకిల్ ని ఓసారి తీక్షణంగా చూసింది మాధురి.

అదే డొక్కు సైకిలు...

అదే వ్యక్తి....

అదే ఖాకీ డ్రస్సు....

అదే జబ్బ సంచి...

అతను ... తనింటి వైపే వస్తున్నాడు. మాధురి గుండెల్లో గుబులు పేరుకుంది.

గుండె దడ పెరిగింది. గోరు ముద్దలు కలపటం మర్చిపోయి... నిశ్చేష్టురాలైంది. అతను ఖచ్చితంగా మాధురి ఇంటి వైపే వస్తున్నాడు. పాపను కిటికీ లోంచి దించి ముందు గదిలోకి వచ్చింది. కాని ముందు గదిలో వేసిన తలుపులు తీయడానికే కాళ్ళు, చేతులు వణుకుతున్నాయి. కుర్చీలో కూలబడి ఆ పాటికే మౌనంగా రోదిస్తూంది.

బయట సైకిల్ బెల్ రెండుసార్లు విన్పించింది.... ఆ తర్వాత "పోస్ట్" అన్న కేక విన్పించింది. అయినా ఆమె లేపలేదు. అతను తెచ్చే కవరు తనకు తెలుసు. అందులో ఏముంటుందో కూడా తెలుసు. అందుకే అతనన్నా... అతడు తెచ్చే వార్తన్నా మాధురికి భయం.... బయట పోస్ట్ మాన్ మరో రెండుసార్లు అరిచాడు. తర్వాత తలుపు సందునుండి ఒక పచ్చటి కవరు నిశ్శబ్దంగా ముందు గదిలో పడింది.

మోకాలు మీద తల ఆనించి మూగగా ఏడుస్తోంది. పాప కూడా తప్పటడుగు లేస్తూ ముందు గదిలోకి వచ్చింది. మాధురికి గతం గుర్తొస్తుంది. ఆనాటి తీపి కలలు ఈనాడు ఆమె పాలిటి మృత్యువులా తయారయ్యాయి. పాప కవరు తీసికొచ్చి 'మమ్మీ' అంటూ ఇచ్చింది. కవరందుకుంది భయం...భయంగా! తన అడ్రసుతో అదే రైటింగు. ధైర్యం కూడ తీసుకుంటూ కవర్ చించింది.

"గౌరవనీయులైన శ్రీమతి మాధురి గారికి...

ఇంతకుముందు మా కుటుంబ దీనగాధ మీకు రాశాను. మరో సారి మీకు గుర్తుచేస్తున్నాను. మీకు పెళ్ళికాక ముందు మా అన్నయ్యని ప్రేమించారు. మీ అవసరాలకు తిప్పుకున్నారు. చివరికి ఎలాగైతేనేం ఓ ధనవంతుడ్ని పెళ్ళి చేసుకున్నారు. మీ పెళ్ళయ్యాక మా కుటుంబాన్ని పోషించే ఒక్కగానొక్క మా అన్నయ్య పిచ్చివాడయ్యాడు. ఉద్యోగానికి రాజీనామా చేసి త్రాగుబోతయ్యాడు. చివరికి మిమ్మల్నే కలవరిస్తూ... మమ్మల్ని విడిచి పోయాడు.

అన్నయ్య చనిపోయిన అయిదు నెలలు కావస్తున్నా మంచం పట్టిన మా అమ్మ మూసిన కన్ను తెరవటం లేదు. ఈ పరిస్థితుల్లో డిగ్రీ డిస్ కంటిన్యూ చేసిన నాకు ఉద్యోగం లేక ఎవరినీ పోషించలేక పోతున్నాను. ఈ పరిస్థితి గ్రహించిన "అక్క" తన దారి తాను చూసుకుంది. మా వట వృక్షం కూలిపోయినందుకు నేడో రేపో మా కుటుంబం బజారున పడనుంది.

ఇంత జరిగినా మా అందరికీ ఒక్కటే తెల్సు. మీ వల్లనే ఇదంతా జరిగింది. అన్నయ్య పోవడంతో మా కుటుంబం చిన్నాభిన్నమైంది. అందుకే మీరంటే నాకు కసి.... ద్వేషం.... పగ! అదే మీ మీద తీర్చు కుంటున్నాను. నాకో ఉద్యోగం ఇవ్వడానికి పద్దెనిమిది వేలు అడిగారు. ఇది బ్లాక్ మెయిల్ అనుకోండి మరేదేనా అనుకోండి. అర్జంటుగా డబ్బు పంపకపోతే అన్నయ్యకు "మీరు రాసిన ఉత్తరాలు.... మీ ఫొటోలు" మీ వారికి పంపించి మీ జీవితాన్ని నరకప్రాయం చేయాల్సి వస్తుంది.

మేం అనుభవించిన నరకం... మానసిక వేదన మీరు కూడా చవి చూడాలి. మీ పరువు బజార్నపడాలి. డబ్బు పంపనట్లయితే వచ్చే ఉత్తరం మీ వారికే అందుతుంది. ఆలోచించుకోండి. —రాజేష్.

ఉత్తరం చదివి మాధురి భయంతో కుంచించుకుపోయింది. భయంగా పాపను ఒడిలోకి తీసుకొని బావురుమంది. ఏడ్చి...ఏడ్చి వెక్కిళ్లు ఆగిపోయినా కన్నీళ్ళు ధారాపాతంగా కారుతూనే వున్నాయి.

ఏ కల్మషం అంటని పాప తల్లిని అయోమయంగా చూస్తూండి పోయింది. ఆలోచనలో పడ్డ మాధురికి తలుపు చప్పుడవటంతో మరింత దుఃఖం పొంగిపొర్లింది. గబగబా ఉత్తరాన్ని చింపేసి కిటికీ గుండా పడే సింది. మరోసారి తలుపుచప్పుడు... కళ్ళు కడుక్కొని నెమ్మదిగా తలుపు తీసింది.

ఎదురుగా చిరునవ్వుతో శ్రీకాంత్!!

ఆమె భర్త!!

తత్తరపాటుని అణిచిపెట్టుకొని నవ్వడానికే ప్రయత్నించింది. శ్రీకాంత్ మాధురిని విష్ చేసి లోపలికెళ్ళి పాపను ముద్దాటడంలో మునిగి పోయాడు. అరగంట తర్వాత మాధురి మామూలు స్థితికి వచ్చింది. భర్త ముఖంలోకి చూడలేక మౌనంగా వుంటోంది.

ఆమె మౌనం శ్రీకాంత్‌కు అర్థంగాదు.

ఆమె డబ్బు గురించి ఆలోచిస్తోంది. ఒక కొలిక్కి రాని ఆలోచనలు! గుండెను తొలిచేస్తూ ఆమెలోని ఆక్టివ్‌నెస్‌ని తినేసాయి.

భయం.... నీరసం.... మాధురి బ్రతుకుని దుర్భరం చేసాయి. శ్రీకాంత్ పేర లెటరు వస్తే.... అన్న ఊహ ఆమె ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీసింది. సైకిల్ బెల్ విన్పించినా, పోస్ట్‌మాన్ కన్పించినా బిగుసుకుపోయేది.

వారంరోజులు గడిచాయి. ఓ మంగళవారంరోజు ఆఫీసుకి సెలవుండి శ్రీకాంత్ ముందు గదిలోకూచొని మ్యాగజైన్ తిరగేస్తున్నాడు.

"పోస్ట్... శ్రీకాంత్‌గారు" అన్న కేక విన్పించింది. వంటగదిలో ఏవో సర్దుతున్న మాధురి గుండెల్లో బాంబులు పేలాయి. చితికిపోతున్న బతుకు కూలిపోయే మృత్యుశాసనాన్ని అతడు అందించాడనుకుంది. ఒక్క ఉదుటున ముందుగదిలోకి వచ్చింది. అప్పటికే శ్రీకాంత్ కవరందుకుని చింపుతున్నాడు. మాధురి ఆకస్మికంగా లాక్కొంది. క్షణాల్లో ఆమె చేతిలో ఉత్తరం ముక్కలు ముక్కలయ్యింది. శ్రీకాంత్ నివ్వెరపోయాడు.

ఉన్మాదిలా "ఈ ఉత్తరం మీరు చదువొద్దు... మీరు చదువొద్దు..." అంటూ టేబిల్‌పై తల ఆనించి రోదించసాగింది. ఉత్తరం ముక్కలు గాలికెక్కడెక్కడో ఎగిరిపోయాయి.

శ్రీకాంత్ విభ్రాంతి లోంచి తేరుకోలేదు. నోటిమాట రాక అలాగే నిల్చుండిపోయాడు. అతడు ఏ సమస్యనయినా తేలిగ్గా తీసుకుంటాడు. నూటికో, కోటికో ఒక్కరిలో వుండే ఆ గొప్పనైజం శ్రీకాంత్‌లో వుంది. మాధురిలో కన్పిస్తున్న మార్పుని గమనిస్తూనే వున్నా ఏ కారణం అడగొద్దని....రోదిస్తున్న భార్య భుజంమీద చేయివేసి ఆప్యాయంగా నొక్కాడు.

"ఎందుకు మాధురీ—ఏమిటీపని! ఎందుకు ఆ కన్నీళ్ళు?" అని మాత్రం అడిగాడు. ఆ మాటకు దుఃఖం కట్టలు తెంచుకొని శ్రీకాంత్ భుజంమీద వాలిపోయి ఏడ్చింది. ఆమెను గుండెలకు హత్తుకొని మెల్లగా బెడ్‌రూంలోకి తీసుకొచ్చి పడుకోబెట్టాడు.